

తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రానున్న వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి తాగునీటి సరఫరా కార్మికులకు సూచించారు. సోమవారం వాటర్ వర్క్స్, సచివాలయ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ రానున్న వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకూడదన్నారు. పైపులైన్లు, వాల్వుల మరమ్మతులు ఉంటే ముందుగానే చేపట్టాలని సూచించారు. ప్రజలకు తాగునీరు పుష్కలంగా అందించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రయివేటు ఫంక్షన్లకు ప్రభుత్వ వాటర్ ట్యాంకులు సరఫరా చేయొద్దని, సరఫరా చేస్తే చర్యలు తప్పవని కమిషనర్ భవాని ప్రసాద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ సంధ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వారికే మరో ఛాన్స్..!

వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థుల జాబితా విడుదల

స్థానిక ఎంఎల్‌సి స్థానాలకు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్ర అభ్యర్థిత్వాలు ఖరారు

ఎంఎల్ఎ కోటాలో జయమంగళ వెంకటరమణకు ఛాన్స్

తీవ్ర అసంతృప్తిలో ఆశావహులు

జెడ్‌పి ఛైర్మన్ పదవి కోసం మొదలైన వ్యూహాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


జిల్లాలోని స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల అభ్యర్థుల జాబితాను అధికార వైసిపి సోమవారం విడుదల చేసింది. స్థానిక సంస్థల కోటాలో ఉమ్మడి జిల్లాలో ఖాళీ అయిన రెండు ఎంఎల్‌సి స్థానాల్లో ఒకటి ప్రస్తుత జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌కు, రెండో స్థానానికి మధ్యతరహా పరిశ్రమల కార్పొరేషన్ ఛైర్మన్ వంకా రవీంద్రను ఎంపిక చేశారు. ఎంఎల్ఎ కోటాలో ఇటీవలే టిడిపి నుంచి వైసిపిలో చేరిన కైకలూరు మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణకు అవకాశం కల్పించారు. ఎంఎల్‌సి అభ్యర్థుల ఎంపికపై ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీ ఏర్పడినప్పటి నుంచి కష్టపడి పని చేస్తున్న వారికి అవకాశం ఇవ్వకుండా ప్రస్తుతం పదవులు అనుభవిస్తున్న నాయకులకే మళ్లీ ఎంఎల్‌సి పదవులు కట్టబెట్టడం ఏమిటని పార్టీలో నాయకులు, కార్యకర్తల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి రెండు పదవుల్లో ఒకటి బిసి, రెండోది జనరల్‌కు కేటాయించనున్నట్లు ముందుగానే స్పష్టత వచ్చింది. టిడిపి నుంచి వైసిపిలోకి వచ్చిన జయమంగళ వెంకటరమణ బిసి కావడంతో మరో పదవి జనరల్ కేటగిరీలో ఇస్తారని అంతా భావించారు. అయితే వైసిపి అధిష్టానం అందరికీ షాక్ ఇచ్చేవిధంగా అభ్యర్థులను ఎంపిక చేసింది.

పదవుల్లో ఉన్న వారికే మళ్లీ పదవులు

ప్రస్తుతం జెడ్‌పి ఛైర్మన్‌గా కవురు శ్రీనివాస్ ఉన్నారు. ఈయనకు ఇంకా దాదాపు మూడున్నరేళ్ల పదవీకాలం ఉంది. పాలకొల్లుకు చెందిన గుణ్ణం నాగబాబుకుగాని, మేకా శేషుబాబుకుగాని ఎంఎల్‌సి పదవి వరిస్తుందని అంతా భావించారు. అయితే వైసిపి అధిష్టానం మాత్రం కవురు శ్రీనివాస్ పేరును ప్రకటించింది. గుణ్ణం నాగబాబుకు ఎంఎల్‌సి పదవిపై నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో వైసిపి అధిష్టానం వ్యూహం మార్చినట్లు తెలుస్తోంది. గుణ్ణంకు పదవి ఇస్తే మేకా శేషుబాబు ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దిగే అవకాశం ఉందని ప్రచారం సాగింది. అదే జరిగితే ఎంఎల్‌సి ఎన్నికలు అనివార్యం కావడంతోపాటు శెట్టిబలిజ, గౌడ సామాజిక తరగతి శేషుబాబుకు వెన్నుదన్నుగా నిలబడే అవకాశం ఉంటుందని అంచనా వేసినట్లు సమాచారం. అదే సామాజిక తరగతికి చెందిన కవురు శ్రీనివాస్‌కు ఇస్తే శేషుబాబు పోటీ చేసే అవకాశం ఉండకపోగా శెట్టిబలిజ, గౌడ సామాజిక తరగతిలో పార్టీకి పేరు వస్తుందని లెక్కలు వేసినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో టిడిపి నుంచి నిమ్మల రామానాయుడు ఎంఎల్ఎగా పోటీచేసే అవకాశం ఉంది. రామానాయుడు కాపు సామాజిక తరగతి కావడంతో అదే తరగతికి చెందిన గుణ్ణం నాగబాబుకు ఎంఎల్ఎ టిక్కెట్ ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. కవురు శ్రీనివాస్‌కు ఎంఎల్‌సి సీటు ఇవ్వడంతో నాగబాబుకు టిక్కెట్ విషయంలో పోటీ కూడా ఉండదు. ఈ ఎత్తుగడతోనే కవురుకు ఎంఎల్‌సి ఇచ్చినట్లు తెలుస్తోంది. 2014 ఎన్నికల్లో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందిన వంకా రవీంద్ర ఇప్పటికే మధ్యతరహా పరిశ్రమల కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఆర్థికంగా నష్టపోవడంతో ఎంఎల్‌సి పదవి కోసం ఈయన గట్టిగా పట్టుబట్టినట్లు తెలుస్తోంది. దీంతో మరో పదవి వంకా రవీంద్రకు ఇచ్చినట్లు చెబుతున్నారు. రెండు ఎంఎల్‌సి పదవులు నరసాపురం పార్లమెంట్ స్థానంలో ఇవ్వడం సైతం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. మెట్ట ప్రాంతానికి పదవి ఇవ్వకపోవడం చర్చనీయాంశమవుతోంది. టిడిపి నుంచి ఎంఎల్‌సి పదవి హామీతో వైసిపికిలోకి వచ్చిన జయమంగళ వెంకటరమణకు ఎంఎల్ఎ కోటాలో ఎంఎల్‌సి అవకాశం కల్పించారు. జయమంగళ కూడా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగారు. ఎంఎల్‌సి పదవి ఆశించిన వారిలో నల్లజర్లకు చెందిన కారుమంచి రమేష్‌తోపాటు పలువురికి తీవ్ర నిరాశే మిగిలింది.

జెడ్‌పి ఛైర్మన్ పదవి కోసం వ్యూహాలు

ప్రస్తుత జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌కు ఎంఎల్‌సి టిక్కెట్ ఖరారు చేయడంతో తదుపరి జెడ్‌పి ఛైర్మన్ పదవి ఎవరికిస్తారనే చర్చ నడుస్తోంది. బిసి సామాజిక తరగతికి చెందిన పలువురు జెడ్‌పిటిసిలు ఛైర్మన్ పదవి కోసం ఇప్పటికే అధిష్టానం వద్దకు క్యూ కట్టినట్లు తెలుస్తోంది. ఈ నెల 23వ తేదీతో ఎంఎల్‌సి నామినేషన్ల తుదిగడువు ముగియనుంది. ఎంఎల్‌సి ఎన్నిక అధికారికంగా ఖరారవ్వగానే కవురు శ్రీనివాస్ జెడ్‌పి ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పదవి కోసం నాయకుల వ్యూహాలు సాగుతున్నాయి.



తాడేపల్లిలో సిఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంఎల్‌సి అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్ర, జయమంగళ వెంకటరమణ

ఎంఎల్‌సి ఎన్నికలకు ఏర్పాట్లు: కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ఎన్నికల అధికారి ఎంకె.మీనాకు తెలిపారు. రాష్ట్రంలో ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల అధికారి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు గురించి రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఐదు పోలింగ్ స్టేషన్లు ఏర్పాట్లు చేస్తున్నామని, అవసరమైన బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశామని అన్నారు. ఎంసిసి టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు నియమించినట్లు చెప్పారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై ఒక కేసు నమోదైందని, ఎఫ్ఐఆర్ కూడా నమోదైందన్నారు. సవివరమైన నివేదిక సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రం ఏర్పాటుపై నివేదిక సమర్పించామని, సవరించిన నివేదికను వెంటనే సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు, డిఆర్ఒ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎవిఎస్ఎస్.మూర్తి, జిల్లా పరిషత్ సిఇఒ కె.రవికుమార్, ఆర్‌డిఒ కె.పెంచల్‌కిషోర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి రమాదేవి పాల్గొన్నారు.

బోణీ కాని నామినేషన్లు

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి సోమవారం కూడా నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు.

డ్వాక్రా గ్రూపులన్నింటికీ ఆసరా ఇవ్వాలని ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



నినదిస్తున్న నేతలు, డ్వాక్రా మహిళలు

పట్టణంలో డ్వాక్రా గ్రూపులన్నిటికీ ఆసరా పథకం వర్తింపజేయాలని పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు ఎస్‌కె.సుభాషిణి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద పట్టణ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కొన్ని డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలకు ఆసరా సొమ్ము అందకపోవడంపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ పట్టణంలో కొన్ని గ్రూపులకు ఆసరా సొమ్ము రాలేదన్నారు. ఫలితంగా డ్వాక్రా మహిళలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమస్యలను ఆర్‌డిఒ ఝాన్సీరాణి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆసరా సొమ్ము రాకపోవడానికి దిగువస్థాయిలో ఉన్న సిఎలు, కంప్యూటర్ ఆపరేటర్లే బాధ్యత వహించాలని మండిపడ్డారు. మూడో విడత అన్ని గ్రూపులకు వెరిఫికేషన్ అయినా గతంలో ఆసరా రాని గ్రూపులకు మాత్రం ఆ డేటా రాక వెరిఫికేషన్ చేయలేదని తెలిపారు. పట్టణంలో గ్రూపులన్నింటికీ ఆసరా వర్తింపజేయాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.సూర్యారావు, రాణి, దుర్గ, లక్ష్మి పాల్గొన్నారు.



విజయకేతనం పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సైన్స్ ఫెయిర్లతో పిల్లల్లో నైపుణ్యం వెలికితీత

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

సైన్స్ ఫెయిర్ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న వ్యక్తిగత నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఈ ప్రదర్శనలు దోహద పడతాయని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. సోమవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక కస్తూరిబా నగర బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు నిర్వహించే జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక, సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు ఉపయోగపడేలా వినూత్న ఆలోచనలతో వారిని మరింత ముందుకెళ్లేలా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థి దశ నుంచే వైజ్ఞానికంపై మక్కువ కలిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే చదవుతోపాటు వైజ్ఞానికంపై విద్యార్థులకు అవగాహన కల్పించి ఉత్తమ శాస్త్రవేత్తలుగా తయారు చేయడానికి సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 2023 సంవత్సరానికిగాను జిల్లాలో నవంబరులో పాఠశాల స్థాయి నుంచి మండలస్థాయి వరకు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో మొదటి, రెండు స్థానాలను సాధించిన వారిని జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శన ఏర్పాటు చేశామని తెలిపారు. వీటిలో పర్యావరణహిత పదార్థాలు, ఆరోగ్యం, పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్, యాప్‌ల తయారీ, పర్యావరణ వాతావరణ మార్పులు, తడిచి మొలకలు వచ్చిన ధాన్యం, రక్షణ, గణిత నమూనాలు అనే ఐదు అంశాల్లో 28 మండలాల నుండి ఎంపికైన 120 ఎగ్జిబిట్స్ జిల్లా సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించామని చెప్పారు. జిల్లాస్థాయిలో మొదటి, రెండు స్థానాలు గెలుపొందిన వారిని ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనకు పంపుతారని తెలిపారు. అనంతరం ప్రదర్శనలో ప్రదర్శించిన వైజ్ఞానిక విషయాలను విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఎన్‌వి.రవిసాగర్, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిపిఒ మల్లికార్జునరావు, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, డ్వామా పీడీ రాంబాబు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్, ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేశ్వరరావు, స్కూలు ప్రధానోపాధ్యాయిని జి.సునీత, జిల్లాలోని డివైఇఒలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

వెనుకబడిన 'పది' విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ

'విజయ కేతనం' పుస్తకావిష్కరణలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 2022-23 సంవత్సరానికి వెనుకబడిన పదో తరగతి విద్యార్థులకు 40 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. దీనికి సంబంధించిన 'విజయ కేతనం' పుస్తకాన్ని ఆయన సోమవారం తన ఛాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఒ ఎన్‌వి.రవిసాగర్ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల కోసం రూపొందించిన 40 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక 'విజయ కేతనం' పుస్తకాన్ని విద్యాశాఖ పరంగా విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. కోవిడ్ వల్ల పదో తరగతిలో పరీక్షా ఫలితాలు నిరాశాజనకంగా ఉంటున్నాయని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ కాలంలో అవకాశం లేకుండా పోయిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని, విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించాలనే సదుద్దేశంతో అన్ని సబ్జెక్టుల్లో నైపుణ్యాలతో కూడిన ఉపాధ్యాయులచే 'విజయ కేతనం' పుస్తకాన్ని రూపొందించి కలెక్టర్ చేతుల మీదుగా విడుదల చేశామని తెలిపారు. ఈ 40 రోజుల ప్రణాళిక ప్రకారం విద్యార్థులు శ్రద్ధగా చదివి పదో తరగతిలో విజయకేతనం సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఇఒ ఎస్.నరసింహమూర్తి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఏలూరు అర్బన్ డి.సాంబశివరావు, డిసిఇబి సెక్రటరీ అంగులూరి సర్వేశ్వరరావు, ఉపాధ్యాయుడు జిజిఎ.స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ నివేదికపై కలెక్టర్ సమీక్ష

జిల్లాస్థాయిలో వివిధ జిల్లా శాఖల అధికారులు నిర్వహిస్తున్న తనిఖీ నివేదికపై సోమవారం గౌతమి సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమీక్షించారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పాఠశాలలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న ఆహార నాణ్యత, కోడిగుడ్లు పంపిణీ, పిల్లల బరువు, ఎత్తు, ప్రదర్శించే ఛార్టుల ఏర్పాటు, పారిశుధ్యం, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారంపై, సర్వే ప్రకారం రక్తహీనతపైన, వారానికి ఒక రోజు ఆకుకూరల్లో మునగాకు ఉపయోగించాలని, పిల్లలకు నేర్పిస్తున్న విద్యపైన, పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత లోపిస్తే ఏజెన్సీని మార్చాలని, వంటలు చేసే షెడ్లలోనే వంటలు చేయాలని, పాఠశాల పనులకు సంబంధించిన మెటీరియల్ భద్రత ప్రదేశాల్లో ఉంచాలే తప్ప, విద్యార్థులు ఆడుకునే క్రీడా మైదానాల్లో వేయకూడదని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పారిశుధ్యం మెరుగుకు, మెడికల్ ఆఫీసర్ డ్యూటీ సమయంలో అందుబాటులో ఉంటున్నారా, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయా తనిఖీ చేసి నివేదికను సంబంధిత జిల్లా అధికారులకు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, డిపిఒ మల్లికార్జునరావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, వ్యవసాయ శాఖ జెడి రామకృష్ణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు నిర్ణీత రేట్లు చెల్లించాలి

యూనియన్ జిల్లా సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న డిఎన్‌విడి.ప్రసాద్

విద్యుత్ సంస్థల స్పాట్ బిల్లింగ్ టెండర్లలో కంపెనీ నిబంధనలు ఉల్లంఘించి మీటర్ రీడర్లకు నిర్ణీత రేట్లను చెల్లించని కాంట్రాక్టర్లను అనర్హులుగా ప్రకటించాలని ఎపి విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ జిల్లా సమావేశం కెఎన్.మల్లేశ్వరరావు అధ్యక్షతన సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ మీటర్ రీడర్ల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు సబ్ డివిజన్లలో స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టర్లు మీటర్ రీడర్లపై వేధింపులు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థల నిర్దేశించిన రేట్లు ఇవ్వకుండా దోచుకుంటున్నారని విమర్శించారు. పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా కట్టకుండా కార్మికులకు ద్రోహం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలుగా విద్యుత్ సంస్థల్లో మీటర్ రీడర్స్ ఎనలేని సేవలందిస్తున్నారని, అయితే సంస్థ మాత్రం మీటర్ రీడర్ల పట్ల చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మీటర్ రీడింగును కేవలం 11 రోజుల్లోనే పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలివ్వడం అన్యాయమన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న మీటర్ రీడర్లకు వచ్చే ఆదాయం సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. మరోవైపు అధికారులు మీటర్ రీడర్లకు ప్రస్తుతం వస్తున్న ఆదాయాన్ని కూడా తగ్గించేలా నిర్ణయాలు చేయడం అన్యాయమన్నారు. మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను ప్రవేశపెట్టే ఆలోచనలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంస్థ నిర్దేశించిన రేట్లను మీటర్ రీడర్లకు ఇవ్వకుండా కాంట్రాక్టర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నా అధికారులు కూడా కాంట్రాక్టర్లకే వంతపాడటం అన్యాయమని విమర్శించారు. జిల్లా అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని మీటర్ రీడర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వి.శ్రీనివాసరావు, జి.దుర్గారావు, జాకబ్, శ్రీనివాస్ మాట్లాడారు.



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న వాసుబాబు, నేతలు

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

ప్రజాశక్తి - గణపవరం

పేదల సొంతింటి కల నెరవేర్చడమే జగనన్న లక్ష్యమని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. సోమవారం స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం పురోగతిని పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ప్రతి పేదవాడికీ గూడు కల్పించడం కోసం జగన్ కృషి చేస్తున్నట్లు చెప్పారు. లేఅవుట్‌లో నీరు, విద్యుత్ సౌకర్యాలపై దృష్టి సారించి ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో గణపవరం సర్పంచి మూరా అలంకారం, వైసిపి నేతలు దండు రాము, చనుమూరి శివప్రసాద్, మాదేటి సురేష్, కొండేటి వెంకటరత్నం పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - వేలేరుపాడు



వినతిపత్రం చూపుతున్న ఎంపిపి లక్ష్మీదేవి

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని ఎంపిపి వి.లక్ష్మీదేవి పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌ఆదిత్యను కోరారు. ఆమె రాజమండ్రిలో సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందించి నిర్వాసితుల సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నారని, అయితే ఆ సభల్లో గత సర్వేల్లో మాదిరిగా ఇంటి విలువలు లేవని, ఫలితంగా నిర్వాసితులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ముంపు గ్రామాల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రకటిస్తున్న ఇంటి విలువలు గతం కంటే పూర్తి భిన్నంగా ఉన్నాయని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి విలువ లెక్కగట్టాలని, అన్ని అర్హతలు కలిగిన యువతకు ప్యాకేజీ వర్తింపచేయాలని, గోదావరి వరదల వల్ల నష్టపోయిన వారికి వెంటనే పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు బద్దె ప్రేమ్ కుమార్, గిల్ల వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

38,483 ఎకరాల్లో అపరాల సాగు నమోదు

జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 38,483 ఎకరాల్లో అపరాలు సాగు చేస్తున్నట్లు ఇ-క్రాప్‌లో నమోదైందని జిల్లా వ్యయసాయాధికారి వై.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఏడు మండలాలు ఏలూరు, పెదపాడు, దెందులూరు, కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లిల్లో అపరాలు అధికంగా సాగు చేస్తున్నారని తెలిపారు. నాఫెడ్ సంస్థ ద్వారా మార్క్‌ఫెడ్ ఏలూరు వారు కొనుగోలు కేంద్రాలను మండలానికి ఒక రైతుభరోసా కేంద్రాన్ని ఎంపిక చేసి అన్ని రైతు భరోసా కేంద్రాలను దానికి అనుసంధానం చేయడం పూర్తయ్యిందని పేర్కొన్నారు. రైతుల నమోదు ప్రక్రియ ఈ నెల 21వ తేదీ నుంచి 'సిఎం యాప్' చేపడతారని తెలిపారు. మండలాల్లో ఎంపిక చేయబడిన రైతుభరోసా కేంద్రాలను సొసైటీల సహకారంతో ఈ నెల 25వ తేదీ నుండి ఏలూరు జిల్లాలో అపరాలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

పాఠశాలలో సోషల్ జస్టిస్ డే

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి పట్టణంలోని భాష్యం స్కూలులో సోమవారం సోషల్ జస్టిస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపూడి జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఇబ్రహీం షరీఫ్ మాట్లాడుతూ ధనిక, పేద, కుల, మత, తెలుపు, నలుపు అనే తేడా లేకుండా అందరూ ఒక్కటేనని, అదే సోషల్ జస్టిస్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. చిన్నప్పటి నుంచి పిల్లలందరూ సమానమనే భావన కలిగి ఉండాలన్నారు. చట్టం అందరికీ ఒక్కటేనని, ధనిక, పేద అనే తేడా ఉండదని చెప్పారు. పిల్లలు తల్లిదండ్రులను గౌరవించాలని, అనుకున్న లక్ష్యాలు సాధించాలనే పట్టుదల కలిగి చదువుకోవాలన్నారు. చదువుతో పాటు సంస్కారం కలిగి జీవించి, భావి భారత పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పింగుల దేవదిరాజు, పట్నాల శ్రీనివాసు, సోషల్ వర్కర్ అక్బర్ అలీ, స్కూల్ ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

వృద్ధుల విడుదలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పామాయిల్ ఫ్యాక్టరీ వ్యర్థాల విడుదలపై చర్యలు తీసుకోవాలని పాడి రైతు కొండపల్లి భాస్కరరావు కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్డిఒ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ఫిర్యాదు చేశారు. పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి విడుదలైన వ్యర్థాల వాగు తాగి తన గేదె మృతి చెందిందని తెలిపారు. ఆ ఏరియాలో ప్రవహిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ వ్యర్థాలు తినడం, తాగడం వల్ల గేదె అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. గతంలో కూడా ఇదే మాదిరిగా గేదె మృతి చెందిందని బాధిత రైతు కొండపల్లి భాస్కరరావు తెలిపారు. దీనిపై గతంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు. కేవలం పామాయిల్ ఫ్యాక్టరీ వ్యర్థాల వల్ల తమ పాడి గేదెలను నష్టపోయామని, దానికి పూర్తి బాధ్యత పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం వహించాలని డిమాండ్ చేశారు. పామాయిల్ ఫ్యాక్టరీ వ్యర్థాల వల్ల మూగ జీవాలు ప్రాణాలు కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వికలాంగుడికి ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వం అని జనసేన పార్టీ చింతలపూడి మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు అన్నారు. పట్టణంలోని గణేష్ కాలనీలో వికలాంగుడైన చల్ల ఏసుకు జనసేన మండల సంయుక్త కార్యదర్శి శీలం రాజా ఆ కాలనీలోని పార్టీ కార్యకర్తలతో కలిసి ఉన్నతంగా ట్రై సైకిల్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి తాము విజయకుమార్, జిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబర్ నారపాము ఏసుబాబు, చీదరాల మల్లికార్జునరావు, మండల కార్యదర్శి పోతుల శ్రీనివాస్, ఎజిఎస్.కుమార్, మండల కార్యదర్శి పూలేటి సునీల్ పాల్గొన్నారు.

23న సీజ్డ్ వాహనాల వేలం

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 23వ తేదీన చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఇబి సిఐ సాయిస్వరూప్ తెలిపారు. పట్టణంలోని ఎస్ఇబి స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. పాటలో పాల్గొనాలనుకునేవారు ఎస్ఇ దుర్గాప్రసాద్ 9603517003, సిఐ సాయి స్వరూప్ 9440902428 సంప్రదించాలని తెలిపారు.

వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి : టిడిపి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని కోటపాడు గ్రామంలో సోమవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ అధ్యక్షులు మంచిన పూర్ణచంద్రరావు కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిపోయిందన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం ప్రజల దగ్గర నుంచి రెట్టింపు సొమ్మును వసూలు చేస్తుందన్నారు. మాట్లాడే హక్కును కూడా హరించి వేస్తుందని, అన్యాయం జరిగిందని మాట్లాడిన వారిపై అక్రమ కేసులు బనాయించి నియంత ప్రభుత్వ పాలన సాగిస్తుందని చెప్పారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్దినేని శ్రీనివాసరావు, మోదుగుముడి రమేష్, వేముల రామారావు, పామర్తి రామారావు, పామర్తి చెన్నారావు, పామర్తి రాదయ్య, మోదుగుముడి శ్రీను, పామర్తి సత్యం, బొమ్మగాని కృష్ణ, బొమ్మగాని శ్రీను, బొమ్మగాని రాంపండు, డొంకిన కిషోర్, పామర్తి రాజేష్ పాల్గొన్నారు.

టి.నరసాపురంలో అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్థానిక అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 27వ కళ్యాణ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజు వేల సంఖ్యలో వచ్చిన ప్రజలకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ కమ్మిల రమేష్‌రాజు మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా చిన కాశీగా పేరొందిన స్థానిక శివాలయంలో వేలాది మంది భక్తుల సహకారంతో ఐదు రోజులు ఉత్సవాలు ఘనంగా నిర్వహించి ఆఖరి రోజు అఖండ అన్న దాన వితరణ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పర్వతనేని మురళి, పసుమర్తి రాము, దేవరపల్లి సీతారామప్రసాద్, కన్నం సర్వేశ్వరరావు, వెజ్జు బాలరాజు, నల్లూరి శ్రీను, లింగారెడ్డి శ్రీను పాల్గొన్నారు.

గణపవరం : మహాశివరాత్రి సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ అన్నసమారాధనలో మూడు వేల మంది పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వసంతోత్సవం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మహా శివరాత్రి ఉత్సవాల్లో ద్వారకా తిరుమల గ్రామ క్షేత్ర పాలకుడు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వసంతోత్సవం, గ్రామోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాలతో స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పోతనపల్లి పడమట లంబాడి తండాలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోతనపల్లి గ్రామానికి చెందిన ధారావత్తు వెంకటేశ్వరరావుకు చెందిన పూరింట్లో ఆదివారం రాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపుచేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న రూ.రెండు లక్షల నగదు, కాసు బంగారం, బట్టలు, వంట సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. తాము కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని, తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ధారావత్తు వెంకటేశ్వరరావు కోరుతున్నారు.

చెట్టును ఢీకొన్న కారు

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పి.అంకంపాలెం పంచాయతీలోని పి.నారాయణపురం సమీపంలో రహదారిపై కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు కామయ్యపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. క్షతగాత్రులు కామయ్యపాలెం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానంలో ముద్దరబోయిన




విజేతలకు బహుమతులు అందిస్తున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామీణ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించాలని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ముసునూరులో సెయింట్ జోసఫ్ యూత్ ఆధ్వర్యంలో 28 టీంలతో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో విజయం సాధించిన ముసునూరు జట్టుకు రూ.35వేలు, రెండో స్థానం సాధించిన చింతలపూడి జట్టుకు రూ.20 వేల నగదు బహుమతులను ఆయన సోమవారం అందించారు. మూడో స్థానంలో నిలిచిన ఈడుపుగల్లు జట్టుకు ముసునూరు సర్పంచి కొండేటి విజయలక్ష్మి ఇర్మియా రూ.పది వేలు అందించారు. నాలుగో స్థానంలో నిలిచిన ఆగిరిపల్లి జట్టుకు రూ.ఎనిమిది వేలు తెలుగుయువత నాయకులు పాకనాటి సీతారాం అందించారు. ఐదో స్థానంలో నిలిచిన ముసునూరు-2 జట్టుకు రూ.ఆరు వేలు టిడిపి మండల క్లస్టర్ గారపాటి నరిసింహరావు, బిసి సెల్ నియోజకవర్గ ఆర్గనైజర్ నక్కా యోహాన్ అందించారు. క్రీడాకారులకు భోజన, వసతులు కాట్రేనిపాడు సర్పంచి జి.సుహాసిని మోహనరావు ఏర్పాటు చేశారు. తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, టిడిపి మండల అధ్యక్షులు దేవినేని ఢలరామ్, తెలుగుయువత మండల నాయకులు కొండేటి బాబి, ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు, వీరాంజనేయులు, వార్డు సభ్యులు రెడ్డి కృష్ణ, నల్లిబోయిన రాంబాబు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల స్థలాల పరిశీలన

ప్రజాశక్తి వార్తకు స్పందన




ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న తహశీల్దార్ రమణరావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురానికి చెందని జగనన్న గృహనిర్మాణ లబ్ధిదారుల కోసం ఉంగుటూరులో సేకరించిన స్థలాల్లో జరుగుతున్న మెరక, చదును పనులను తహశీల్దార్ రమణరావు సోమవారం పరిశీలించారు. ఉంగుటూరులో సర్వే నెంబరు 860/1లో 2.70 ఎకరాలు, దాన్ని ఆనుకుని ఉన్న మరో ప్రాంతంలో సర్వే నెంబర్ 895/1లో 2.69 ఎకరాలను ప్రభుత్వం గతంలోనే కొనుగోలు చేసింది. అందులో సర్వే నెంబరు 895/1లో హౌసింగ్‌శాఖ నుంచి వచ్చిన రూ.67 లక్షల నిధులతో పూడిక, చదును పనులు గత కొన్నిరోజుల నుంచి జరుగుతున్నాయి. మిగతా 2.70 ఎకరాల్లో ఎలాంటి పనులు జరగటం లేదు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీన ప్రజాశక్తిలో ప్రచురితమైన ఎక్కడ వేసిన గొంగలి అక్కడే నారాయణపురం ప్రారంభం కాని జగనన్న ఇళ్ల నిర్మాణాలు కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సర్వే నెంబరు 860/1లో చెట్లు తొలగించేందుకు సంబంధిత అధికారులకు నివేదిక పంపించామని, వారి నుంచి ఉత్తర్వులు వచ్చాక చెట్లను తొలగించి ఫ్లాట్లు వేసి లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నా భూమి చూపించండి

బాధితుడు సత్యనారాయణసూరి ఆవేదన



భూమిని పరిశీలిస్తున్న సర్వేయర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని మర్లపాలెం గ్రామంలో వివాదంలో ఉన్న భూమిని జిల్లా సర్వేయర్ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. తన తండ్రికి 1978లో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ప్రభుత్వం ఇచ్చిన భూమిలో తాను సాగు చేసుకుంటుండగా ఆ భూమి నాదంటూ వేరే వ్యక్తి వచ్చి తనను వెళ్లగొట్టాడని గ్రామానికి చెందిన తిరునగరి సత్యనారాయణసూరి ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శ్రీనివాసరావు ఆ భూమిని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణసూరి మాట్లాడుతూ తన తండ్రి తిరునగరి శేషగిరిరావుకు 1978లో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా అప్పటి ప్రభుత్వం ఎకరం భూమి ఇచ్చిందని తెలిపారు. అప్పటి నుండి ఆ భూమి ఎక్కడ ఉందో చూపించలేదని, ఆ భూమిని చూపించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగి తన తండ్రి మృతి చెందాడని చెప్పారు. ఆ భూమి కోసం తాను తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగగా 2016లో అప్పటి తహశీల్దార్ షఖీరు నీషా బేగం మర్లపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో 19/2 పి సర్వే నెంబర్‌లో ఎకరం భూమి చూపించారని సత్య నారాయణసూరి తెలిపారు. అప్పటి నుంచి భూమిని సాగు చేసుకుంటున్నానని, ఈ క్రమంలో ఆ భూమి నాదంటూ గ్రామానికి చెందిన పర్వతనేని నాగేశ్వరరావు ఆ భూమిలో నుంచి తనను వెళ్లగొట్టాడని, అప్పటి నుంచి తన భూమి తనకు చూపించమంటూ చాట్రాయి తహశీల్దార్ కార్యాలయం చుటూ తిరిగి తిరిగి విసుగు చెంది స్పందన కార్యక్రమంలో పలుమార్లు అర్జీ పెట్టుకున్నానని సత్యనారాయణ సూరి తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ప్రభుత్వం మంజూరు చేసిన భూమి ఆధారమని, తన భూమి తనకు చూపించి న్యాయం చేయాలని కోరాడు. భూమిని పరిశీలించిన జిల్లా సర్వేయర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 1978లో ఎవరెవరికి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ప్రభుత్వం భూమిని మంజూరు చేసిందో, ఆ రిజిస్టర్ వివరాలన్నీ సేకరించి బాధితుడికి న్యాయం చేయాలని చాట్రాయి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, విఆర్ఒ, సచివాలయ కార్యదర్శి పాల్గొన్నారు.

కన్వీనర్లు, గృహ సారధులకు శిక్షణ

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక మార్కెట్ యార్డ్ కార్యాలయ ఆవరణలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయం దిశగా అందరూ సమాయత్తం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఐనాల బ్రహ్మాజీ, వైస్ ఛైర్మన్ పివివి.రవికుమార్, జెడ్‌పిటిసి సభ్యులు బొర్రా సత్యవతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచులు మసిముక్కు మారుతీ ప్రసన్న, బత్తిన ఉమామహేశ్వరరావు, గద్దె ఆనంద్, మహాదేవ విజయబాబు, పెరుమాళ్ల భోగేశ్వరరావు పాల్గొన్నారు.

పాస్టర్లపై దాడి దారుణం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

చింతలపూడి నియోజకవర్గం ఎర్రంపల్లి గ్రామంలోని సిఎస్ఐ చర్చి పాస్టర్ హెచ్.శ్రీనివాసరావుపై, ఆయన భార్యపై ఇటీవల అదే గ్రామానికి చెందిన తగరం దేవ సహాయం, పల్లి రామారావు మరి కొంత మందితో కలిసి దాడి చేయడం దారుణమని బహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్ అన్నారు. ఏలూరులోని బహుజన సేన సమితి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడికి పాల్పడినవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో కలెక్టర్, ఎస్‌పిలను కలిసి పాస్టర్లకు రక్షణ కల్పించాలని వినతిపత్రం ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బహుజన సేన సమితి చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి లక్క పాము చంటి, బిఎస్ఎస్ చింతలపూడి నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు సికకోలు స్టాలిన్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'మా నమ్మకం నువ్వే జగన్'



ముసునూరులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రజాశక్తి - ముసునూరు

మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని ముసునూరు గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు గృహ సారధులను, సచివాలయ కన్వీనర్లను ఉద్దేశించి మాట్లాడుతూ నవరత్నాల పేరుతో అందించిన పలు సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచులు పేరం కృష్ణ, నక్కనబోయిన సత్యనారాయణ, మాజీ సర్పంచి రేగుల గోపాలకృష్ణ, యువజన నాయకులు గూంట్రు రంగారావు, మాజీ సర్పంచులు జలగం శేషగిరిరావు, తుల్లిమెల్లి సుబ్బారావు, ప్రవీణసుధాకర్, వాలంటీర్లు, గృహ సారధులు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని బూరుగుగూడెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షులు మిద్దె బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. వాలంటీర్ల పనితీరును మెరుగుపరిచేందుకు గృహ సారధులు వారికి సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లంక నిర్మల, జెడ్‌పిటిసి సభ్యులు చెలికాని అనూష, రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైసిపి నాయకులు, గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి ఎంపిటిసి సుమన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక కలిదిండి శ్రీ వెంకటేశ్వర ఆలయ అభివృద్ధికి కలిదిండి ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్ రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ బోయిన రామకృష్ణ, ఎఎంసి మాజీ ఛైర్మన్ నీలపాల వెంకటేశ్వరరావుకు ఈ నగదును అందించారు. ఆలయ అభివృద్ధికి నీలి సుమన్ సాయం అందించడం అభినందనీయమని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు.

తోట బాబికి ధర్మరాజు పరామర్శ

ప్రజాశక్తి - గణపవరం

గణపవరానికి చెందిన తోట త్రిమూర్తులు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను లక్ష్మీనారాయణ ఫౌండేషన్ అధ్యక్షులు, జనసేన నాయకులు ధర్మరాజు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు కుమారుడు తోట బాబి మాట్లాడుతూ తన తండ్రి అనారోగ్యంతో చనిపోయాడని, పెద్ద దిక్కును కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మరాజు మాట్లాడుతూ ఆందోళన చెందవద్దని, కుటుంబానికి జనసేన అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. తోటబాబి వల్లూరు సచివాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట పవన్, పొత్తూరి కృష్ణంరాజు, గోలి సాయి, పుండరికాక్షుడు పాల్గొన్నారు.

తారకరత్న మృతి బాధాకరం

ప్రజాశక్తి - చింతలపూడి

తారకరత్న ఆకాల మరణం బాధాకరమని మాజీ మంత్రి పీతల సుజాత సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సినీ హీరో, టిడిపి యువ నాయకుడు నందమూరి తారకరత్న చిన్న వయసులోనే మరణించడం ఆ కుటుంబానికే కాకుండా టిడిపికి, నందమూరి అభిమానులకు తీరని లోటన్నారు. చిన్న వయసులోనే తన మంచితనం, చెరగని చిరునవ్వుతో అనేకమంది అభిమానులను తారకరత్న సంపాదించుకున్నారన్నారు.

చివరి శ్వాస వరకు పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేసిన నాయకుడు నందమూరి తారకరత్న అని టిడిపి చింతలపూడి పట్టణ ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం అన్నారు. చింతలపూడిలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద తారకరత్న చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏలూరు పార్లమెంట్ రైతు మీడియా కోఆర్డినేటర్ చేకూరి అంకమ్మరావు, ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్ మాట్లాడుతూ నందమూరి తారకరత్న సేవలు పార్టీ ఎప్పటికీ మర్చిపోదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షులు నరుకుళ్ల రాజేష్, చింతలపూడి పట్టణ ఉపాధ్యక్షులు పొదిలి రాయప్ప, ఎస్‌సి సెల్ మండల ఉపాధ్యక్షుడు ఎర్రమాల సత్యనారాయణ, టిఎన్ఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గద్దె శివకోటేశ్వరరావు, నాయకులు నాగభూషణం, చింతలపూడి నియోజకవర్గ నాయకులు మారుమూడి థామస్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి ధార వీరేంద్ర పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : తారకరత్న మృతి బాధాకరమని టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. బుట్టాయగూడెంలోని పోలవరం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో నందమూరి తారకరత్న చిత్రపటానికి సోమవారం ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ సినీరంగంలో, రాజకీయాల్లో ఎంతో భవిష్యత్ ఉన్న తారకరత్నను కోల్పోవడం పార్టీకి, నందమూరి అభిమానులకు తీరని లోటన్నారు. టిడిపి పట్ల ఎంతో మక్కువతో ఎన్నికలు జరిగిన ప్రతిసారి రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసేవారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గద్దె అబ్బులు, యంద్రప్రగడ శ్రీనివాస్, పసుమర్తి భీమేశ్వరరావు, రాము, జారం ఛాందిని, తెల్లం వెంకటేశ్వరరావు, గద్దె సూర్యచంద్రరావు, మనెల్లి బాలు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : నందమూరి తారకరత్న లేని లోటు టిడిపి కి తీర్చలేనిదని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారకరత్న టిడిపికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కష్టకాలంలో ఎప్పుడూ పార్టీకి అండగా నిలుస్తూ కార్యకర్తలను ముందుండి నడిపేవారిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తలపంటి రాజశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ ఇబ్రహీం, నూజివీడు మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి యనమదల సత్యనారాయణ (నాని), పట్టణ క్లస్టర్ ఇన్‌ఛార్జి మండా శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ పాదం సత్యనారాయణ, కందుపల్లి చెన్నారావు, మండల తెలుగు రైతు నాయకులు అక్కినేని బెనర్జీ, తుక్కులూరు గ్రామ పార్టీ అధ్యక్షులు అన్నే సురేష్, పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ సుభాని పాల్గొన్నారు.

మహారాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యూడీషియల్ 1వ తరగతి మెజిస్ట్రేట్ వారి కోర్టులో

ఓ.యస్.నెం. 450/2022

బిట్వీన్:

కర్రి వియజకుమార్ రెడ్డి ...వాది

మరియు

జడ్డు వెంకటేశ్వరరావు ...ప్రతివాది

తండ్రి: సత్యనారాయణ, డో.నెం. 16618-5, ప్లాట్ నెం.18, 7వ వార్డు, అజ్జరం రోడ్‌కు దక్షిణాన, తణుకు-534211, తణుకు మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు.

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు దావా, వాది మీ నుంచి రూ.8,81,138/-లు ప్రామిశరీ నోటు బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేయగా మీరు దావా సమన్లు అందుకొననందున, శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ ఆర్డరు వేసినారు. కావున మీరు **ది.24-03-2023 ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు ఎదుట హాజరు అవ్వనిఎడల మీ పరోక్షమునందు దావా తీర్మానం జరుగునని ఇందుమూలముగా తమకు తెలియజేయడమైనది.**

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీగోటేటి సత్యవెంకట వరప్రసాద్
అడ్వకేట్స్, తణుకు.
17-02-23. సెల్: 93900 18122

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి తణుకు ప॥గో॥జిల్లా వారి కోర్టులో

ఓ.యస్.నెం. 662/2022

బిట్వీన్:

పెన్మత్స చాంద్ బాబు రాధాకృష్ణ ...వాది

మరియు

సలాది మురళీ కృష్ణ ...ప్రతివాది

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

ప్రతివాది: సలాది మురళీకృష్ణ, తండ్రి: లేటు అవతారం, వాటర్ సప్లయ్ టాంక్ వద్ద, మొఖాసా కల్వపూడి-521345, మండవల్లి మండలం, లోగడ కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా.

పై నెంబరు దావా ప్రామిశరీ నోటు బాకీ రూ.2,91,873/- వసూలు నిమిత్తం దాఖలు చేయగా దావా సమన్లు అందుకొనక మీరు కాలయాపన చేయుచున్నందున పేపరు ప్రకటన ద్వారా సమన్లు ఆర్డరు వేసినారు. కావున మీరు **ది.07-03-2023 ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల మీ పరోక్షమునందు దావా తీర్మానం జరుగునని ఇందుమూలముగా తమకు తెలియజేయడమైనది.**

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీగోటేటి సత్యవెంకట వరప్రసాద్
అడ్వకేట్స్, తణుకు.
17-02-23. సెల్: 93900 18122

ప్రకటన

మహారాజశ్రీ ఏలూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో

Transfer O.P.No. 40 of 2022

పిటీషనర్లు:

1) చుందూరి వెంకట సత్యనారాయణ, తండ్రి: శివప్రసాద్, డో.నెం. 7-133/2, అలంపురం, పెంటపాడు మండలం.

మరియు

రెస్పాండెంటు:

1) వల్లూరి విజయ ప్రకాష్, తండ్రి: సత్యనారాయణ, 43 సం॥లు, డో.నెం. 7-5-18, 15వ వార్డు, పాతవూరు. తణుకు. ప॥గో॥జిల్లా.

పై నెంబరు పిటీషను గ్రంధములో శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ఎన్ని నోటీసులు జారీ చేసినప్పటికీ మీరు హాజరు కానందున మీ హాజరు నిమిత్తం **ది.22-02-2023వ తేదీకి శ్రీ కోర్టు వారు వాయిదా వేసి ఉన్నందున మీరు సదరు తేదీని ఉదయం 10 గంటల నుండి స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి పై నెంబరు పిటీషను పై మీ ఆక్షేపణలు తెలియ చేసుకొనవలసినదిగా** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానము జరుపబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

డి.ఎస్.వి.మాణిక్యాలరావు
ఎన్.వి.ఎస్.ఎస్.పి.రామ మోహన్
ఎన్.వి.ఎస్.రామానుజం
అడ్వకేట్స్, తణుకు.
15-02-23. సెల్: 99088 22433

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No. 22/2022 in **O.S. No. 172/2010**

Between:

1. గుడిగంట్ల సూర్యనారాయణ (died) and 2 Others ...D.Hrs

మరియు

1. జెట్టి సాయిబాబా (died) and 3 Others ...J.Drs

4th J.Dr:

జెట్టి లక్ష్మీనాథ్, S/o. late సాయిబాబా, డోర్ నెం. 1-19, Near: వీరబ్రహ్మం గారి టెంపుల్, రాయలం, భీమవరం మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు E.P. లో మీకు కోర్టు నుండి ఎన్ని పర్యాయాలు నోటీసులు పంపించిననూ మీరు తీసుకొనుటకు నిరాకరించినందున శ్రీ కోర్టు వారు ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. కావున మీరు **ది. 10-03-2023 ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక అడ్వకేట్ ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనను వినిపించుకోవలసినదిగా తెలియజేయటమైనది. లేనిపక్షంలో మీ పరోక్షమందు శ్రీ కోర్టు వారు తీర్మానించడం జరుగునని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

జి.వి.స్టీఫెన్‌బాబు
పచ్చిగోళ్ళ రమేష్
స్థలం: భీమవరం అడ్వకేట్స్, భీమవరం
తేది:18-2-2023 సెల్:8790950666

ప్రకటన

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో, భీమవరం

O.S. No. 24/2022

Between:

శ్రీమతి యర్రంశెట్టి వెంకటలక్ష్మి -వాది

V/s

బండారు వెంకటమణి మరియు వగైరాలు -ప్రతివాదులు

2వ ప్రతివాది: శ్రీమతి బండారు సత్యవతి, W/o. లేటు వెంకట సుబ్బయ్యానాయుడు, కుప్పనపూడి, ఆకివీడు మండలం.

3వ ప్రతివాది: బండారు విక్రమ్, S/o. లేటు వెంకట సుబ్బయ్యానాయుడు, కుప్పనపూడి, ఆకివీడు మండలం.

పై నెంబరు గ్రంథంలో **2వ ప్రతివాది అయిన శ్రీమతి బండారు సత్యవతి మరియు 3వ ప్రతివాది అయిన బండారు విక్రమ్** గార్లకు అనేక పర్యాయములు శ్రీయుత కోర్టు వారి ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను సమన్లు పంపినను అందుకొనక కాలయాపన చేయుచున్నారని, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటనకు అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది. 15-03-2023 తేదీకి వాయిదా అయివున్నది. కావున **2వ ప్రతివాది అయిన శ్రీమతి బండారు సత్యవతి మరియు 3వ ప్రతివాది అయిన బండారు విక్రమ్** గార్లు **ది. 15-03-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** తమ అభ్యంతరములు స్వయంగా గాని, తమ అడ్వకేటు గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియచేసు కోవలెను. లేనిఎడల సదరు గ్రంధమును **2వ ప్రతివాది అయిన శ్రీమతి బండారు సత్యవతి మరియు 3వ ప్రతివాది అయిన బండారు విక్రమ్** గార్ల పరోక్షమున తీర్మానింపబడును అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

అల్లూరి వెంకటేశ్వరరాజు
అడ్వకేట్, భీమవరం
ప్రాంతం: భీమవరం వాది తరపు అడ్వకేట్
తేది:18-2-2023 సెల్: 9848211102